RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శనివారం, ఏప్రిల్ 18, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 15 | పేజీలు: 8 | వెల : రూ.1



### హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్‌కు థాంక్స్ చెప్పిన ట్రంప్

- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ఇరాన్ అనుమతి
- అయితే ఇరాన్‌పై నావికా దిగ్బంధం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం
- లెబనాన్ కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ నిర్ణయం తీసుకుంది
- ఇరాన్‌తో ఒప్పందం పూర్తయ్యే వరకు ఆంక్షలు ఉంటాయి: అమెరికా

# వీగిన మహిళా బిల్లు

## లోక్‌సభలో మోదీ సర్కార్‌కు భారీ ఎదురుదెబ్బ

- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక బిల్లు తిరస్కరణ
- అవసరమైన 352 ఓట్లకు బదులు 298కే పరిమితమైన మద్దతు
- 230 మంది విపక్ష సభ్యుల వ్యతిరేక ఓటు కీలకం
- రాజ్యాంగ సవరణతో పాటు డీలిమిటేషన్ బిల్లు ఉపసంహరణ
- మోదీ హయాంలో మొదటిసారి ఓ బిల్లు విఫలం
- మహిళా కోటా పేరుతో రాజకీయ పోరు ముదిరింది



### మహిళల హక్కులకు అడ్డంకులు కలిగిస్తున్నారు: అమిత్‌షా

- మహిళా రిజర్వేషన్లపై విపక్షాల వైఖరిపై ఆగ్రహం
- ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపునూ అడ్డుకుంటున్నారని విమర్శ
- పునర్విభజనతో ఓటర్ల సమానత్వం సాధ్యమని స్పష్టం
- లోక్‌సభలో మూడు బిల్లులపై సమాధానాలు
- పారదర్శకంగా ప్రక్రియ జరుగుతుందని హామీ
- రాబోయే ఎన్నికల్లో మహిళలే తీర్పు చెబుతారని వ్యాఖ్య



### దక్షిణాది ప్రాతినిధ్యానికి కోత దేశద్రోహమే:రాహుల్

- పునర్విభజనతో ఎన్నికల రూపురేఖలు మారతాయని హెచ్చరిక
- అధికార దాహంతో రాష్ట్రాల హక్కులు తుంచుతున్నారని విమర్శ
- ఓబీసీలు, దళితుల రిజర్వేషన్లకు గండి కొట్టడమే లక్ష్యమని ఆరోపణ
- ఇది దేశ సమైఖ్యతను దెబ్బతీసే ప్రయత్నమని వ్యాఖ్య




న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా భావించిన మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో విఫలమవడం సంచలనంగా మారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రతిష్టాత్మక బిల్లు మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయింది. శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అవసరమైన 352 ఓట్లు రాకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా బిల్లు వీగిపోయినట్టు ప్రకటించారు. మొత్తం 540 మంది సభ్యుల్లో 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది మాత్రమే అనుకూలంగా ఓటేశారు. 230 మంది విపక్ష సభ్యులు వ్యతిరేకంగా ఓటేయడంతో బిల్లుకు కావాల్సిన మెజారిటీ అందలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకుంది. రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్న డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను కూడా వెనక్కు తీసుకుంటున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. మోదీ ప్రభుత్వ కాలంలో లోక్‌సభలో ఒక బిల్లు ఇలా ఓటింగ్‌లో వీగిపోవడం ఇదే తొలిసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్‌ను సమావేశపరచి మూడు కీలక బిల్లులు తీసుకురావడం, వాటిపై 18 గంటలకు పైగా చర్చ జరగడం జరిగినప్పటికీ చివరికి బిల్లు ఆమోదం పొందకపోవడం కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ బిల్లులో భాగంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచి, అందులో 33 శాతం మహిళలకు కేటాయించాలనే ప్రతిపాదన ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని పునర్విభజన చేపట్టాలని ప్రభుత్వం యోచించింది. అయితే ఈ ప్రతిపాదనలపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయ ప్రయోజనాల కోసం డీలిమిటేషన్‌ను ముందుకు తెస్తున్నారని ఆరోపించాయి. బిల్లు విఫలమైన తర్వాత అధికార, విపక్షాల మధ్య విమర్శల యుద్ధం మరింత ముదిరింది. మహిళల హక్కులను అడ్డుకున్నవారిగా కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలను కేంద్ర మంత్రులు తప్పుపట్టారు. దేశ మహిళలు ఈ నిర్ణయాన్ని ఎప్పటికీ మర్చిపోరని, భవిష్యత్ ఎన్నికల్లో దీని ప్రభావం తప్పదని

(మిగతా 2వ పేజీలో)



# పెండింగ్ బకాయిలను విడుదల చేయండి

- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యం సేకరించండి
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి..
- యాసంగి పంటకు అనుకూలంగా బాయిల్డ్ బియ్యం ఉత్పత్తి
- పోషకాహార బియ్యం పంపిణీ పునఃప్రారంభానికి వినతి
- కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి



న్యూఢిల్లీ: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి కేంద్ర ఆహార శాఖ మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వరి ధాన్యం బాయిల్డ్ బియ్యం తయారీకి అనుకూలమని వివరించారు. గత సీజన్ల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ బియ్యానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నుంచి సరఫరాను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో సుమారు తొంభై లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అందులో భాగంగా ముప్పై లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని ఐదు శాతం నూకతో, అదనంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యాన్ని పది శాతం నూకతో సరఫరా చేయగలమని తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర మంత్రి

(మిగతా 2వ పేజీలో)



కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ
- మే 30లోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం

### మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే: కేటీఆర్

- డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి
- బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ
- ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన



# దేశం పెద్ద ప్రమాదం నుండి బయటపడింది: రేవంత్

- భారత చరిత్రలో ఇది చిరస్మరణీయ ఘట్టం
- సవరణ బిల్లును అడ్డుకున్న విపక్ష ఐక్యతకు కృతజ్ఞతలు
- ప్రజాస్వామ్య రక్షణలో అన్ని పార్టీల పాత్ర కీలకం
- దక్షిణాది హక్కుల పోరాటానికి జాతీయ మద్దతు: సీఎం



హైదరాబాద్: లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకోవడం ద్వారా దేశం ఒక పెద్ద ప్రమాదం నుంచి బయట పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల ఐక్యతతో జాతీయ విపత్తు నివారించబడిందని, ఈ రోజు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా పార్లమెంటులో ఏకమై పోరాడిన అన్ని పార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు ఒకే వేదికపై నిలబడి బిల్లును వ్యతిరేకించడం ప్రజాస్వామ్య బలం అని ఆయన అభివర్ణించారు. ప్రాంతీయ, జాతీయ నాయకులు కలసి నిలిచిన ఈ పోరాటం దేశ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడటంలో ఈ ఐక్యత ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై ప్రారంభం నుంచే

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

శనివారం, ఏప్రిల్ 18, 2026

# మహిళల హక్కులకు అడ్డంకులు కలిగిస్తున్నారు: అమిత్‌షా

**మహిళా రిజర్వేషన్లపై విపక్షాల వైఖరిపై ఆగ్రహం**

**ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపునూ అడ్డుకుంటున్నారని విమర్శ**

**పునర్విభజనతో ఓటర్ల సమానత్వం సాధ్యమని స్పష్టం**

**లోక్‌సభలో మూడు బిల్లులపై సమాధానాలు**

**పారదర్శకంగా ప్రక్రియ జరుగుతుందని హామీ**

**రాబోయే ఎన్నికల్లో మహిళలే తీర్పు చెబుతారని వ్యాఖ్య**



దేశంలో మహిళా రిజర్వేషన్లను ప్రతిపక్షాలు నిస్సిగ్గుగా వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా విమర్శించారు. చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెరగడాన్ని కూడా వారు అంగీకరించడం లేదని అన్నారు. మహిళల హక్కులకు అడ్డంకులు సృష్టిస్తున్నవారిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మహిళలే వారికి తగిన సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఓటర్ల హేతుబద్ధీకరణ జరుగుతుందని వివరించారు. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా ఉండగా, మరికొన్నింటిలో తక్కువగా ఉందని తెలిపారు. ఈ అసమానతలను సరిచేసి ప్రతి ఓటుకు సమాన విలువ కల్పించడమే లక్ష్యమని చెప్పారు. పునర్విభజన ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి అనుమానాలకు తావులేదని ఆయన హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు ఇది అవసరమని పేర్కొన్నారు. కాలానుగుణంగా నియోజకవర్గాల మార్పులు చేయడానికి రాజ్యాంగం అనుమతిస్తోందని గుర్తుచేశారు. విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. పునర్విభజన వల్ల ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని తెలిపారు. ప్రతి రాష్ట్రానికి సముచిత ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే లిఖితపూర్వక హామీ ఇవ్వడానికి కూడా సిద్ధమని వెల్లడించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం అసంభవమని ఆయన తేల్చిచెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదని పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నాయని విమర్శించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా తెలిపారు. గతంలో మహిళలకు కీలక పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళలకు సముచిత గౌరవం, అవకాశాలు కల్పించడం ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చేసిన సేవలను కూడా ఆయన స్మరించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదేనని అన్నారు. అయితే ఆ నాయకుడికి తగిన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడంలో ఎలాంటి అడ్డంకులు వచ్చినా ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు.

# దక్షిణాది ప్రాతినిధ్యానికి కోత దేశద్రోహమే: రాహుల్



న్యూఢిల్లీ: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్ర ప్రభుత్వం దేశ రాజకీయ సమతౌల్యాన్ని మార్చే కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని, ఇది దేశ సమాఖ్య వ్యవస్థకు ముప్పుగా మారుతుందని అన్నారు. అధికారంలో కొనసాగే తాపత్రయంతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, పునర్విభజన అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ కాదని, దేశ ఎన్నికల ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చే చర్య అని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ అసలు లక్ష్యాన్ని దాచిపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయకుండా, కొత్త మార్పుల పేరుతో ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఓబీసీలు, దళితులకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించకుండా వారిని అధికారానికి దూరం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన అభిప్రాయపడ్డారు. కుల గణన పూర్తికాకముందే పునర్విభజనపై ముందుకు రావడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే పారదర్శక విధానం అవసరమని స్పష్టం చేశారు. దక్షిణాది, ఈశాన్య ప్రాంతాల ప్రజలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని రాహుల్ హామీ ఇచ్చారు. వారి హక్కులను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలు దేశానికి ప్రమాదకరమని, విపక్షాలు కలసి దీనిని అడ్డుకుంటాయని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని దెబ్బతీసే చర్యలను అనుమతించబోమని హెచ్చరించారు. ప్రసంగం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి అన్ని వర్గాలు కలసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు**

**కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ**

**మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం**



బీఆర్ఎస్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీని వేసింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలని కమిటీని ఆదేశించింది. కల్నల్ పరీక్షిత్ మెహ్రా నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణులు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాల వ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై కమిటీ పనిచేయనుంది. వారానికి రెండుసార్లు సమావేశమై పురోగతిని సమీక్షిస్తుంది. ప్రతిరోజు జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే కీలకమైన పరీక్షలను పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. బ్యారేజీల పునాదుల పటిష్ఠతను తెలుసుకోవడానికి మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, మేడిగడ్డను పాక్షికంగానైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్‌కు థాంక్స్ చెప్పిన ట్రంప్

**హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ఇరాన్ అనుమతి.. అయితే ఇరాన్‌పై నావికా దిగ్బంధం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం**

**లెబనాన్ కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.. ఇరాన్‌తో ఒప్పందం పూర్తయ్యే వరకు ఆంక్షలు ఉంటాయి: అమెరికా**



మధ్యప్రాచ్యంలో నెలకొన్న కాల్పుల విరమణ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచినప్పటికీ, ఇరాన్‌పై మాత్రం తమ నావికా దిగ్బంధం (బ్లాకేడ్) కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి వ్యాపారానికి, పూర్తి రాకపోకలకు సిద్ధంగా ఉందని, అందుకు ఇరాన్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, అయితే ఇరాన్‌తో తమ ఒప్పందం 100 శాతం పూర్తయ్యే వరకు ఆ దేశంపై సైనిక దిగ్బంధం కొనసాగుతుందని ఆయన తెలిపారు. చాలా అంశాలపై ఇప్పటికే చర్చలు జరిగాయని, ఈ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు, లెబనాన్‌లో కాల్పుల విరమణకు అనుగుణంగా హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ప్రపంచంలోనే కీలకమైన ఈ జలమార్గం తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. అయితే, అమెరికా తన సైనిక వైఖరిని మార్చుకోలేదు. ఈ దిగ్బంధంలో భాగంగా 10,000 మందికి పైగా సైనికులు, డజనుకు పైగా యుద్ధ నౌకలు, విమానాలు పాల్గొంటున్నాయని అమెరికా సైనిక అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు జరుగుతుండగానే, మరోవైపు ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని కొనసాగించడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. పర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్‌తో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైనది.

## వీగిన మహిళా బిల్లు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇక విపక్షాలు మాత్రం ఈ ఫలితాన్ని తమ విజయం గా చిత్రీకరించాయి. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ తీసుకొచ్చిన రాజకీయ కుట్రలను తాము అడ్డుకున్నామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థపై కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు ఇది చెక్ పెట్టినట్టేనని విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. బిల్లు ఓటమిని నిరసిస్తూ బీజేపీ మహిళా ఎంపీలు పార్లమెంటు ఆవరణలో ధర్నాకు దిగారు. మహిళలకు జరిగిన అన్యాయాన్ని దేశం సహించబోదని నినాదాలు చేశారు. కేంద్ర మంత్రులు, పలువురు మహిళా ఎంపీలు ఈ నిరసనలో పాల్గొనడం గమనార్హం. మొత్తంగా మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడం దేశ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసింది. ఒకవైపు మహిళా హక్కుల అంశం, మరోవైపు డీలిమిటేషన్‌పై వివాదం కలిసిపోవడంతో ఈ అంశం ఇకపై కూడా జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా కొనసాగనున్నది.

## పెండింగ్ బకాయిలను విడుదల చేయండి

వెల్లడించారు. దేశంలో బియ్యం అవసరాలను తీర్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణలో రాష్ట్రం ముందంజలో ఉందని, సేకరణ తర్వాత నలభై ఎనిమిది గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని వివరించారు. ఇక గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం కోరింది. వర్షాకాల పంటకు సంబంధించిన అదనపు లెవీ సేకరణ బకాయిలుగా ఉన్న వెయ్యి నాలుగు వందల అరవై ఎనిమిది కోట్ల రూపాయలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. పౌరసరఫరాల శాఖపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన నిధులు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు గతంలో అమలు చేసిన పోషకాహార బియ్యం పంపిణీని మళ్లీ ప్రారంభించాలని కూడా కోరారు. పాఠశాలలు, వసతిగృహాలు, శిశు సంక్షేమ కేంద్రాల ద్వారా ఈ బియ్యం అందించడాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో భారీగా వరి ఉత్పత్తి జరుగుతోందని, ఇందులో గణనీయమైన భాగాన్ని కేంద్రానికి సరఫరా చేయగల సామర్థ్యం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ దేశ అవసరాలను తీర్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

## దేశం పెద్ద ప్రమాదం నుండి బయటపడింది: రేవంత్

తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు గుర్తుచేశారు. లోక్‌సభ సీట్ల పెంపు విధానం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తుందని, దీనిపై ముందుగానే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాసినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు వంటి వేర్వేరు అంశాలను కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రాష్ట్రాలు నష్టపోయేలా చేసే విధానాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా సమతౌల్యాన్ని కాపాడే మార్గాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై విస్తృత చర్చలు జరపాలని కేంద్రాన్ని ముందుగానే కోరినట్లు వెల్లడించారు. మహిళా రిజర్వేషన్‌కు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చని, దీనికి అదనపు మార్పులు అవసరం లేదని తెలిపారు. మహిళల రాజకీయ సాధికారత ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. జనాభా ఆధారంగా సీట్ల పెంపు అమలు చేస్తే సమాఖ్య వ్యవస్థలో అసమానతలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉందని, ఇది కేవలం సంఖ్యల విషయం కాదని, దేశ సమగ్రతకు సంబంధించిన అంశమని అన్నారు. అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం కల్పించే విధానమే దేశాన్ని బలోపేతం చేస్తుందని ఆయన నొక్కిచెప్పారు.

## మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే: కేటీఆర్

**డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్**

**బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి**

**బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ**

**డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన**



లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మ హిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి**

మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడం కుదరదనే విషయం ఈరోజు లోక్ సభలో జరిగిన పరిణామాలను బట్టి బీజేపీ తెలుసుకోవాలని అన్నారు. దీనితో పాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా రాష్ట్ర హక్కు అని కేటీఆర్ అన్నారు. జమ్ము కశ్మీర్, అసోంలో దేశవ్యాప్త డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో, దేశవ్యాప్త డీలిమిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మేడ్చల్ కలెక్టరేట్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన



నాగారం, ఏప్రిల్ 17:-(వాయిస్ టుడే): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం శనివారం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో మహా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇదే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కూడా వివిధ కార్యాలయాల్లో ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, తెలంగాణ నాన్ గెజెటెడ్ అధికారుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్, మేడ్చల్ జిల్లా గెజెటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు వినోద్ ఆధ్వర్యం వహించారు. ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు గడిచినా, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చొరవ చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రభుత్వం నిరంతరం "చిన్న చూపు" చూపుతూ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల కారణంగా ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. మే నెల నుంచి ఇకపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడిస్తూ 52 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, అలాగే పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా లా ఆఫీసర్ చంద్రవతికి ఉద్యోగుల సమస్యలపై విన్నతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉగ్రరూపం దాల్చే కార్యాచరణ చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించనున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తుద హెచ్చరిక జారీ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రమేశ్వర్ గౌడ్ (అడిషనల్ సెక్రటరీ జనరల్), బి. వెంకటేశ్వర్లు (జాయింట్ సెక్రటరీ), సహదేవ్ గౌడ్ (సెంట్రల్ ట్రెజరర్, తెలంగాణ గెజెటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ యూనియన్), జైసింహ రెడ్డి (జాయింట్ సెక్రటరీ), ధనయ్య, రాజు, ఆనంద్ రెడ్డి, విట్టల్, మధన్ రెడ్డి (సెక్రటరీలు), సుధాకర్ (కన్వీనర్), రామకృష్ణ రెడ్డి (కో-కన్వీనర్), బి. భరత్ కుమార్ (టి.ఎన్.జి.ఓస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెక్రటరీ), శేష సాయి గిరికాంత్ (టి.ఎన్.జి.ఓస్ జిల్లా ట్రెజరర్), జేమ్స్ దాస్ (వైస్ ప్రెసిడెంట్), అశ్విని, సుధీర్ కుమార్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), శ్రీనివాస్ (మేడ్చల్ యూనిట్ ప్రెసిడెంట్), ఎస్.డి. నజీమా (కుత్బుల్లాపూర్ యూనిట్ ప్రెసిడెంట్), సత్య జ్యోతి (సెక్రటరీ), అరుణ (మల్కాజ్గిరి యూనిట్ టి.ఎన్.జి.ఓస్ ప్రెసిడెంట్), రవి యాదవ్ (షామీర్‌పేట్ యూనిట్ ప్రెసిడెంట్), శాలి పహిల్వాన్ (షామీర్‌పేట్ యూనిట్ సెక్రటరీ), కార్తిక్ (కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్), అక్షయ్ కుమార్ (కలెక్టరేట్ యూనిట్ సెక్రటరీ), బి. రవి ప్రకాష్ గౌడ్ (ఆనిమల్ హస్బండ్రీ ఫోరం జిల్లా ప్రెసిడెంట్), యాదగిరి (సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ప్రెసిడెంట్), వినయ్ (సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఫోరం సెక్రటరీ) వెంకట్ రెడ్డి చంద్రకుమార్ ఉమాకాంత్ కిషోర్ కిరణ్ హర్ష రాజ్ కుమార్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



## మన సంక్షేమం కోసం పనిచేసే నేత, కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రధాత బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 17(వాయిస్ టుడే ): బిఆర్ఎస్ నాయకులు ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను ఈరోజు చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్దిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 130 – కుత్బుల్లాపూర్ డివిజన్ లబ్ధిదారుడు రామ్ వినోద్ కుమార్ తండ్రి రామ్ గౌరీ శంకర్ కు రూ. 2,00,000/- (రెండు లక్షల రూపాయలు) మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ కు పద్మా నగర్ కు చెందిన జి.జగన్ తండ్రి జి.కిష్టయ్యకు 1,50,000/- లక్షలు ( లక్షా యాభై వేల రూపాయలు) మంజూరు కాగా ఇంకొక లబ్ధిదారుడు జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్ శ్రీనివాస్ నగర్ కు చెందిన రుద్రరాజు సాయి బాబా రాజు తండ్రి ఆర్. రామచంద్ర రాజుకు రూ. 1,00,000/- (లక్షా రూపాయలు) మంజూరు కాగా మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎంపీపీ సన్నా కవిత శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, గుబ్బల లక్ష్మీనారాయణ, విజయ్, రమణారెడ్డి, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ భారతానికి గర్వకారణం

### ఇంజనీర్ వేదకుమార్ మణికొండ INTACH జాతీయ కార్యవర్గానికి ఎన్నిక



హైదరాబాద్ : ఏప్రిల్ 17 ( వాయిస్ టుడే): న్యూ ఢిల్లీలోని INTACH ప్రధాన కార్యాలయంలో, ఇటీవల (2026--2029) మూడు సంవత్సరాల కాలానికి INTACH గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎన్నికైన ఇంజనీర్ వేదకుమార్ మణికొండ గారు, ఇప్పుడు INTACHజాతీయ కార్యవర్గానికి కూడా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని INTACH చైర్మన్ శ్రీ అశోక్ సింగ్ ఠాకూర్ గారు, సభ్య కార్యదర్శి శ్రీ రవీంద్ర సింగ్ (రిటైర్డ్ IAS) సమక్షంలో ప్రకటించారు. ఈ గౌరవం ఆయన నాయకత్వం, అనుభవం మరియు వారసత్వ పరిరక్షణపై ఉన్న అంకితభావానికి గుర్తింపుగా నిలుస్తోంది. ఈ పదవికి ఆయన ఎన్నిక కావడం ద్వారా సంస్థ పనుల్లో ఆయన మరింత సమర్థంగా సేవలందిస్తారనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఈ విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా చెప్పుకోవచ్చు. దక్షిణ భారతదేశం నుండి INTACH జాతీయ కార్యవర్గానికి ఎన్నికైన కొద్దిమందిలో ఇంజనీర్ వేదకుమార్ మణికొండ గారు ఒకరు. ఇది ఆయన వ్యక్తిగత కృషితో పాటు, జాతీయ స్థాయిలో దక్షిణ భారతదేశ ప్రాధాన్యం పెరుగుతున్నదనికీ సూచిస్తుంది. సాంస్కృతిక వారసత్వం, పరిరక్షణ మరియు విద్యా రంగాల్లో ఆయన చేసిన దీర్ఘకాల సేవలతో, ఆయన జాతీయ కార్యవర్గంలో భాగమవడం ×చీూజు కార్యక్రమాలను మరింత బలపరచడంలో మరియు దేశవ్యాప్తంగా విస్తరించడంలో సహాయపడుతుంది.



## మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి ఉపాధ్యక్షులుగా నియమితులైన కూన శ్రీనివాస్ గౌడ్

### శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు నాయకులు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 17(వాయిస్ టుడే ): కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన కూన శ్రీనివాస్ గౌడ్ వారి కార్యాలయంలో వెంకట్ గౌడ్ మరియు కూన రాఘవేందర్ గౌడ్ మరియు లింగం యాదవ్ వారి మిత్రబృందం కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



## పాఠశాలలు విద్య పై నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నాగారం, ఏప్రిల్ 17:-(వాయిస్ టుడే)పాఠశాలలో వ్యాపార దృక్పథం తో కాకుండా విద్య పై నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగారం మునిసిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. నాగారం శిల్పనగర్‌లో నారాయణ స్కూల్ ఓపెనింగ్ ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగారం మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి, స్కూల్ యాజమాన్యం పాల్గొనడం జరిగింది.




## కాప్రాలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

### ప్రారంభించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి

నాగారం, ఏప్రిల్ 17:-(వాయిస్ టుడే): చలివేంద్రంని తన తండ్రి అల్లం కృష్ణ యాదవ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లం రాకేష్ యాదవ్, అల్లం రాకేష్ యాదవ్ వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందయమని పరమేశ్వర్ రెడ్డిగారు అన్నారు. కాప్రా, ధమ్మాయిగూడ ప్రధాన రహదారి లో అల్లం రాకేష్ యాదవ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం ని పరమేశ్వర్ రెడ్డి ప్రారంచారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన అల్లం రాకేష్ యాదవ్ ని అభినందిస్తున్నట్లు చెప్పారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. కాప్రా ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, రాజేందర్, అల్లం నాగరాజు, అల్లం సుధాకర్, అల్లం పూర్ణ, అల్లం సాయి కిరణ్, అల్లం మల్లేష్, అల్లం హరికృష్ణ, అల్లం శంకర్, అల్లం సతీష్, మరియు కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, జిల్లా ఏ ఎం సి డైరెక్టర్ పూర్ణయాదవ్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రాజు, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ డి మురళీ, మాజీ కౌన్సిలర్ రాజేందర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ కొబ్బనూరి నాగరాజు, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, బాబురావు, ఓర్ల శ్రీధర్ రెడ్డి, పి నరేందర్ గౌడ్, వినోద్ కుమార్, జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదానం.. ఎంతో పుణ్యకార్యం

### భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 17: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. పవిత్రమైన అమవాస్య సందర్భంగా శుక్రవారం కోఠి రాణి పార్కు, నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నార్తులకు, నిరుపేదలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించేందుకు భజరంగ్ సేన అందుబాటులో ఉంటుందన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పదిమందికి పంచి పెట్టడమే మహాదానమని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రభు, నందు, శ్రీనివాస్ సంఘం, కొండారెడ్డి, భక్తులు. తదితరులు పాల్గొన్నారు. అన్నదాతలకు భక్తులు దైవ ఆశీస్సులతో పాటు ఆశీర్వాదం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.



## మహిళలకు ఉచిత విద్యను అందించండి

### తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 17: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బేటి బచావో.. బేటి పడావో పథకం ద్వారా మహిళలకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో విద్యార్థినీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సరే.. మంత్రివర్గంలో 33 శాతం మహిళలకు చోటు కల్పించాలని అన్నారు. నామినేటేడ్ పదవులు, పార్టీల అధ్యక్షపదవులు, ఉద్యోగాల్లో 33శాతం అవకాశాలు ఇవ్వాలని, అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే మహిళా బిల్లు అంటే మహిళలు చూస్తూ ఊరుకోరని ఆయన హెచ్చరించారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఏదని, సామాజిక న్యాయం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. పేదరికంతో ఉన్నత విద్యను అభ్యసించలేక ఎంతో మంది విద్యార్థినీలు చదువును మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఎంత వరకు చదువుకుంటే అంత వరకు. ఏది చదువుకుంటే అందులో ఉచిత విద్యను అందించాలని అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నేతలు, విద్యార్థినీలు మహేశ్వరి, దివ్యజ్యోతి, గాయాత్రి, లావణ్య, హారిక, ప్రణీత, శ్రీవర్షిని, తదితరులు పాల్గొన్నారు.



## గాజులరామారం సర్కిల్‌లో హిందూ సమ్మేళనానికి భారీగా హాజరుకావాలి

### డెగల సతీశ్ బాబు పిలుపు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 17(వాయిస్ టుడే ): గాజులరామారం సర్కిల్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో డెగల సతీశ్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని రాబోయే ఆదివారం జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి మరియు ఇతర ప్రముఖ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమాన్ని అవహేళన చేస్తే సహించం

### ఆది జాంబవ అరుంధతి సేవా సమితి కమిటీ సభ్యులు తుడుం శ్రీనివాస్



నాగారం, ఏప్రిల్ 17:-(వాయిస్ టుడే): తెలంగాణ ఉద్యమ స్వాతంత్ర్య సమరంతో సమానమని, దాన్ని దేశ విభజనతో పోల్చడం అసహ్యకరమని తెలంగాణ వాదిగా ఆది జాంబవ అరుంధతి సేవా సమితి కమిటీ సభ్యులు తుడుం శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్‌లో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ విభజన (2014)ను ఇండియా-పాక్ విభజన (1947) కంటే దారుణంగా, హీనంగా పోల్చి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దీన్ని 'అత్యంత దారుణంగా' చేసిందని ఆరోపించారు. ఇది తెలంగాణ ప్రజలు, నేతల్లో తీవ్ర కోపాన్ని రేకెత్తించిందన్నారు. తెలంగాణ ఏర్పాటును అమరవీరుల త్యాగాలను అవమానిస్తున్నారని మండిపడ్డారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శనివారం 18 ఏప్రిల్ 2026

# ప్రభుత్వం ఉద్యోగులకు 2023 నుండి రావలసిన రెండవ పి.ఆర్.సి.ని వెంటనే అమలు చేయాలి

**:- తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యాదాద్రి భువనగిరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మందాడి ఉపేందర్ రెడ్డి**

**రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏకకాలంలో ఇవ్వాలి.. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యాదాద్రి భువనగిరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మందాడి ఉపేందర్ రెడ్డి**




(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక ఉ పెంక్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ( టీ జి ఇ జె ఏసి ) రాష్ట్రకార్యవర్గం పిలుపు మేరకు శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయము నందు ఉద్యోగులు భోజన విరామ సమయములో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇట్టి కార్యక్రమమునకు ముఖ్య అతిదిగా తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహ అధ్యక్షులు,యాదాద్రి భువనగిరి జిల్లా జె.ఏ.సి. చైర్మన్ మందాడి ఉపేందర్ రెడ్డి హాజరైనారు. ఇట్టి ధర్మాను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 2023 నుండి రావలసిన రెండవ పి.ఆర్.సి.ని వెంటనే అమలు చేయాలని,పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బెనిఫిట్స్ మొత్తమును ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేసారు. ఇప్పటికే రాష్ట్రంలో పెన్షన్ బెనిఫిట్స్ అందక "80" మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని ఆవేదన వ్యక్తం చేసారు. సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల యొక్క పెండింగ్లో ఉన్న ఉద్యోగుల 13వేల కోట్ల బిల్లులు,పెండింగ్ లో ఉన్న "5 డి.ఏ."లను కూడా వెంటనే విడుదల చేయాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిన విధంగా ఉద్యోగులకు ఇచ్చిన అన్ని రకాల డిమాండ్స్ ను అమలు పరిచి ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమములో జె.ఏ.సి. సెక్రటరీ జనరల్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు భగత్ మాట్లాడుతూ ఉద్యోగులకు హామీ ఇచ్చిన హెల్త్ కార్డుకు వెంటనే మంజూరి చేయాలని అలాగే కొత్తపెన్షన్ విధానమును( సిపిఎస్ ) రద్దుచేస్తూ పాత పెన్షన్ విధానమును ( ఓ పి ఎస్ ) ను యధావిధిగా అమలుచేయాలని డిమాండ్ చేసారు.ఇట్టి కార్యక్రమములో జె.ఏ.సి. డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమరెందర్ రెడ్డి ( పి ఆర్ టి యు ) , కోచైర్మన్ యాదయ్య ( యుటిఎఫ్ ), యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు, జె.ఏ.సి. కో చైర్మన్ జగన్మోహన్ ప్రసాద్ , కార్యదర్శి శ్రీనివాస్ , యాదాద్రి భువనగిరి జిల్లా టి ఎన్ జి ఓ ఎస్ కోశాధికారి శ్రీకాంత్ , ట్రెస అధ్యక్షులు కృష్ణ,డి.టి.యఫ్. లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, వెటర్నరీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాస్, హాస్టర్ వెల్ఫర్ సంఘం అధ్యక్షులు శైలజ , పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుశశికాంత్ ,ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.



## కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థో స్పెషలైజేషన్‌తో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

హైదరాబాద్ : ఏప్రిల్ 17;( వాయిస్ టూ డే): కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ కస్తూరి, కిమ్స్ సన్‌షైన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ చందర్ తేజావత్, సీఓఓ డాక్టర్ సుధాకర్ జాదవ్ లతోపాటు ప్రత్యేక వైద్యులతో కలిసి శుక్రవారం కాచిగూడ లోని మున్నూరుకాపు (కాపు) విద్యార్థి వసతిగృహంలో ఆర్థో స్పెషలైజేషన్‌తో ఒక ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రజల ఎముకలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతోనే ఈ ఉచిత క్యాంపు ఏర్పాటు చేసినట్లు కిమ్స్ సన్ షైన్ డైరెక్టర్ శ్రీధర్ కస్తూరి వెల్లడించారు. రోగులకు బీపీ, షుగర్, బీఎండీ వంటి సేవలను ఉచితంగా పరీక్షలు చేసినట్లు ఆయన తెలిపారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ నిర్వహించిన పది నెలల సుదీర్ఘ వైద్య శిబిరాలలో ఇది రెండవదన్నారు. మున్నూరుకాపు విద్యార్థి నివాస గృహం ట్రస్ట్ డీడ్ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్న ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని మున్నూరుకాపు విద్యార్థి నివాస గృహం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంజనా రెడ్డి హామీ ఇచ్చారు. ఈ శిబిరంలో కిమ్స్ సన్‌షైన్ డాక్టర్ గాయత్రి, నర్సింగ్ సిబ్బంది ఆర్య, నీను, బిఎంఎస్ మోహన్, అసిస్టెంట్ మేనేజర్స్ ఉదయ్, సురేష్, వ్యవస్థాపక ట్రస్టీల కుటుంబ సభ్యులు దడువై రాఘవేందర్, ఏనుగుల మాణిక్ ప్రభు, ఆకుల పాండురంగారావు, మంద సూర్యప్ర కాష్, రాధాకృష్ణ, డా.రామచందర్, డా. అనురాధ, పెద్ద ఎత్తున రోగులు పాల్గొన్నారు.




## మహనీయుల విగ్రహాల తొలగింపుపై దళితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం

### బొంతు శ్రీదేవి యాదవ్

నాగారం, ఏప్రిల్ 17:-(వాయిస్ టుడే): మహనీయుల విగ్రహాలను తొలగింపుపై న్యాయ పోరాటం చేస్తామని చర్లపల్లి మాజీ కార్పోరేటర్ బొంతు శ్రీదేవి హెచ్చరించారు. పెద్ద చర్లపల్లి చౌరస్తాలో శుక్రవారం విగ్రహాలను తొలగించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దళిత సంఘాలతో కలిసి కార్యక్రమాన్ని చేపట్టి న్యాయం సాధించే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. విగ్రహాల ధ్వంసం ఘటనపై వెంటనే స్పందించిన ఆమె మాట్లాడుతూ ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ సమస్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్తానన్నారు. జిహెచ్ఎంసి మాజీ చైర్మన్ బొంతు రామ్మోహన్ చొరవతో ఈ విషయం ప్రభుత్వ పేదల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపేలా చేస్తానన్నారు. శనివారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.విగ్రహాలను తిరిగి అప్పగించాలని బలంగా కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ సాయంత్రం వరకు విగ్రహాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఆనందోత్సవంలో డా అంబేద్కర్ చిత్రపటానికి సబ్బండ వర్గాల నాయకుల తో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. గ్రామ ప్రజలు, దళిత వర్గాలు, సబ్బండ వర్గాలు స్థానిక నాయకులందరితో కలిసి చేసిన ఈ పోరాటం వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ విజయంతో గ్రామ ప్రజలు, దళిత వర్గాలు, స్థానిక నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ, మహనీయుల విగ్రహాలను తిరిగి సాధించడంలో కీలక పాత్ర పోషించిన బొంతు శ్రీదేవి యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, అన్యాయానికి ఎదురు నిలిచి న్యాయం సాధించడంలో ముందుండే నాయకులుగా బొంతు రామ్మోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ మరోసారి తమ అంకితభావాన్ని చాటుకున్నారని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా టీఎస్ జె యు అధ్యక్షుడిగా సొల్లేటి గోవర్ధనా చారి నియామకం



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ( పి ఎస్ జె యు ) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా సొల్లేటి గోవర్ధనా చారినీ నియమించినట్లు టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కొత్త ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా దిడ్డికాడి రాము, సంగిశెట్టి స్వామి దాస్, కోశాధికారిగా గుర్రం నరసింహ లను నియమించినట్లు రాష్ట్ర నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు సొల్లేటి గోవర్ధనా చారి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తానని, జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడుతూ.. టీఎస్ జేయు యూనియన్ను జిల్లాలో బలోపేతం చేస్తానన్నారు.తనను అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు నారాగోని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ లకు కృతజ్ఞతలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గా సొల్లేటి గోవర్ధన చారి నియామకం కావడం పై పలువురు జర్నలిస్టులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## యాదాద్రిలో ఈ నెల 19న మున్నూరు కాపు సంఘం భవనంలో 108 జంటలతో విశ్వశాంతి.. 1008 జంటలతో మహా యజ్ఞం

### మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్

(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- ఈనెల 19 ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు గల మున్నూరు కాపు భవనం లో 108 జంటలతో విశ్వశాంతి మహా యజ్ఞం, 1008 జంటలతో కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది. ఈ సందర్భంగా మన పీర్జాదిగూడ కార్పొరేషన్ లిమిట్స్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్ కి, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని.. మన కుల సంఘాన్ని ఆహ్వానిస్తూ..గొడ్డు లక్ష్మణ్ పటేల్ కు ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగినది. సుమారు 5000 వేల మందికి పైగా భక్తులు హాజరు కాబోతున్న ఈ కార్యక్రమానికి మన మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు, కుల బంధువులు ఈనెల 19 న ఆదివారం రోజున ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుచున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో..108 జంటలతో విశ్వశాంతి మహా యజ్ఞం,1008 జంటలతో కళ్యాణ మహోత్సవం,5000 భక్తుల హాజరు,సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నట్లు, మున్నూరు కాపు సభ్యులు ప్రతి ఒక్కరు హాజరుకావాలని మున్నూరు కాపు సంఘం పీర్జాదిగూడ కార్పొరేషన్ లిమిట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్ పటేల్,ప్రధాన కార్యదర్శి : లక్కాకుల సంజీవ పటేల్, కోశాధికారి ఆకుల శ్రవణ్ కుమార్ పటేల్ఉకమిటీ సభ్యులు పేర్కొన్నారు.



## రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు

### డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ...

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఏకైక కులం మాదిగలు అంటూ మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎమ్ఎస్ఎఫ్ ఆద్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సోమశేఖర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగలు హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ఈరోజు వరకు పోరాడుతున్నాడని చెప్పారు. ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహా ఋజువైందని అన్నారు. ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేయాలను కోరారు. మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే. ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత మంది జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఓయూ లో పిహెచ్డి అడ్మిషన్ల భర్తీ ప్రక్రియలో సీటు మ్యాట్రిక్స్ విధానంతో మాదిగ విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న నోరు మెదపని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాతి ద్రోహులని అన్నారు. రేవంత్ రెడ్డి ఇలాంటి ద్రోహులను ప్రోత్సహిస్తే తన రాజకీయ ఉనికికే ప్రమాదమని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ సీనియర్ నాయకులు వీరపాకుల పరుశరామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా రంగంలో మహిళల ప్రాధాన్యత పెరగాలి

**చిన్న మధ్య తరహా పత్రికలను ప్రోత్సహించాలి**

**పాత్రికేయ వృత్తిలో విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి:-**

**టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య**



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి ): మీడియా రంగంలో మహిళలకు మంచి అవకాశాలున్నాయని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని పాత్రికేయ వృత్తిలో రాణించాలని సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. శుక్రవారం హైదరాబాద్ వనస్థలిపురంలోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో మహిళా జర్నలిస్టు యాదమ్మ నేతృత్వంలో వెలువడుతున్న "జన సమయం" పక్ష పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ఒకప్పుడు ప్రింట్ పత్రికలకే పరిమితమైన మీడియా రంగం ఇప్పుడు ఎలక్ట్రానిక్ రంగంతో విస్తరించి సమాచారం వేగవంతమైందని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో వచ్చిన టీవీ, సోషల్ మీడియా, యూట్యూబ్, డిజిటల్ మీడియా వల్ల పత్రిక రంగం ప్రజాదరణ కోల్పోకుండా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, మధ్య తరహా పత్రికలను ప్రోత్సహించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ప్రభుత్వం చిన్న,మధ్య తరహా పత్రికల పట్ల కక్షసాధింపు ధోరణి అవలంభిస్తుందని,ఈ వైఖరి సరైంది కాదని అన్నారు. పాత్రికేయ వృత్తిలో విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని,పవిత్రమైన జర్నలిజం వృత్తిని అపవిత్రం చేయడం సమాజానికి మంచిది కాదని అన్నారు.పత్రికా రంగంలో ఒక మహిళా జర్నలిస్టు ధైర్యంతో పక్ష పత్రికను నడిపందుకు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. ఏ పత్రికైనా ప్రజలకు ఉపయోగపడే మంచి వార్తలు, వార్తా కథనాలతో ప్రజాధరణ పొందేటట్లు కృషి చేయాలని మామిడి సోమయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ గౌడ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



## ఓయూలో ఎంపీ తేజస్వీ సూర్య దిష్టిబొమ్మ దహనం చేసిన ఎన్.ఎస్.యు.ఐ నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి): బెంగళూరు ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్రంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఎన్.ఎస్.యు.ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఎన్.ఎస్.యు.ఐ జాతీయ నాయకుడు కోట దుర్గరాజ్ ఆధ్వర్యంలో ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవల్లి వెంకటస్వామి మాట్లాడుతూ, పార్లమెంట్ లో మహిళా బిల్లుపై చర్చ సందర్భంగా సంబంధం లేని తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను పాకిస్తాన్ తో పోల్చడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియకుండానే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులు, ప్రజల పోరాటంతో పాటు కాంగ్రెస్ పార్టీ కృషితోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. అదేవిధంగా, గతంలో ఉస్మానియా యూనివర్సిటీలో అనుమతులు లేకుండా ప్రవేశించి గేట్లు ధ్వంసం చేసిన ఘటనలను కూడా ప్రస్తావిస్తూ, తేజస్వీ సూర్య వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్.ఎస్.యు.ఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో బీజేపీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో వికాస్, శ్రీధర్, శేఖర్ రెడ్డి, మారుపాక సతీష్, సురేందర్, శివ, గంగు, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649
VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
తెలుగు దినపత్రిక





# కేపీహెచ్‌బీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

కేపీహెచ్‌బీ: హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. అప్రమత్తమైన బస్సు సిబ్బంది వెంటనే ప్రయాణికులను కిందికి దించివేశారు. బస్సు మియాపూర్ నుంచి ఎస్ఆర్ నగర్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీదుర్గా మహేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లు వెళ్లేందుకు బయల్దేరింది. ఈ క్రమంలో కేపీహెచ్‌బీ సమీపంలోని పద్మావతి ప్లాజా బస్‌స్టాప్ వద్ద ఆగి ఉంది. రాత్రి 10.45 గంటల సమయంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో తొలుత మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను కిందికి దించివేశారు. అనంతరం మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. ఘటనాస్థలికి ట్రాఫిక్ సీఐ జానయ్య, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది.






# కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

కూకట్‌పల్లి: ఏప్రిల్ 17(వాయిస్ టుడే): టీజీఇజేఏసీ పిలుపుమేరకు కూకట్‌పల్లి మండల జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మేడిపల్లిలో భోజన విరామ సమయంలో సమావేశమై, అనంతరం కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ డిమాండ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ నివేదికను విడుదల చేసి అందరికీ అమోదయోగ్యమైన పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తదనంతరం ఉపాధ్యాయ ప్రతినిధులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల అధ్యక్షులు ఎం. వెంకట్, ప్రధాన కార్యదర్శి విట్ఠల్, టిఎస్యుటిఎఫ్ జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్, మండల అధ్యక్షులు బి. విఠల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, ఎస్టియు అధ్యక్షుడు జెడ్. రవీందర్, కృష్ణ గోపాల్, టిఎస్యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు మస్తాన్, కాంప్లెక్స్ కన్వీనర్లు రాజశేఖర్, రమేష్, రాధిక తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

# అంబటి అనుదీప్ హత్య కేసులో దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి : చందు జనార్ధన్ డిమాండ్



ఏలూరు :ఏప్రిల్ 17(వాయిస్ టుడే): అంబటి అనుదీప్ హత్యపై విచారణ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పెదవేగి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ని శుక్రవారం ఏలూరులో వారి కార్యాలయంలో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్ కలిశారు. ఈ సందర్భంగా కేసు విచారణను త్వరితగతిన పూర్తి చేసి, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం చందు జనార్ధన్ మాట్లాడుతూ, అంబటి అనుదీప్‌ను చంపుతామని ఇంటికి వచ్చి బెదిరించిన వారిని ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన నాటి నుంచి నేటి వరకు అనేక అనుమానాలు ఉన్నప్పటికీ అవి నివృత్తి అయ్యే పరిస్థితి కనిపించడంలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం చట్రాయ్‌లోని దివంగత అంబటి అనుదీప్ నివాసంలో సమావేశం నిర్వహించి, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు చందు జనార్ధన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చట్రాయ్ జనసేన నాయకులు తుమ్మల జగన్, అనుదీప్ తండ్రి అంబటి గోపి, జేఏసీ నాయకులు ఏ.వి. శ్రీనివాస్, జగదీష్, కడవకొల్లు సాగర్, శ్రీనివాస్ తదితరులు, చట్రాయ్ యువ నాయకత్వం పాల్గొన్నారు.

# పార్లమెంటు సాక్షిగా ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలి

**కందుల మధు...**

**తేజస్వి సూర్యకు పిండ ప్రధానం చేసిన తెలంగాణ జాగృతి నాయకులు**



సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ తో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ని వెంటనే పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని తెలంగాణ జాగృతి స్టేట్ సెక్రటరీ కందుల మధు, టీజేఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుమ్మడి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య వాఖ్యలను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద కందుల మధు, గుమ్మడి క్రాంతి కుమార్, సాయినేత, మంతెన మధు ఆధ్వర్యంలో పిండ ప్రధానం చేశారు. వారిని అడ్డుకున్న ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకొని పీఎస్ కు తరలించారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు మాట్లాడుతూ.. పార్లమెంట్లో డీలిమిటేషన్ పై చర్చ జరగకుండా పార్లమెంటును పక్క ద్రోవ పట్టించడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల విషం కక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు, ఎంతో మంది అమరులై సాధించిన తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వాక్యలు చేయడం సిగ్గు చేటన్నారు. తక్షణమే తేజస్వి సూర్య తెలంగాణ సమాజానికి పార్లమెంటు సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో భౌతిక దాడులు జరుగుతాయని హెచ్చరించారు.




# ఎండల నుంచి ఉపశమనం కోసం ఉచిత తాగునీటి చలివేంద్రం ప్రారంభం

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మల్కాజిగిరి పరిధిలోని ట్రాఫిక్ త్రిముల్ఘేరీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. త్రిముల్ఘేరీ ఏసీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ త్రిముల్ఘేరీ విభాగం ఏసీపీ జి. శంకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాదచారులు, వాహనదారులు, ప్రయాణికులకు తాగునీరు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ చలివేంద్రం ద్వారా రోజూ వందలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రజాహిత కార్యక్రమం యంవి ఆటోమొబైల్స్ మరియు హైజీన్ ఆక్వా సొల్యూషన్స్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సంస్థలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని అధికారులు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైజీన్ ఆక్వా సొల్యూషన్స్ యజమాని శ్రీహరి, ఎం.వి ఆటోమొబైల్స్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



**సైనిక్ పూర్ నుండి భువనగిరికి వచ్చే మంచినీటిని ఎయిమ్స్ హాస్పిటల్ వారు రోగుల కోసం మూడు లక్షల లీటర్ల నీటిని వాడడం వల్ల భువనగిరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. కాబట్టి ప్రత్యేక పైప్లైన్ ద్వారా అదనంగా నీటిని వాడుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి.. భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్లు వినతి పత్రం అందజేశారు.**

– యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి

# పీఆర్సీ 51% ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలి

**టీజీఈజేఏసీ నిరసనలో టియుటిఎఫ్ అధ్యక్షుడు ఆర్.వి.**



సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఉమ్మడి కార్యాచరణ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు (ఆర్.వి) పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కీసర మరియు సెక్రటేరియట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీని 51% ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించి, 2023 జూలై నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు బకాయి పడిన సరెండర్ లీవ్, జీపీఎఫ్, డీఏ ఏరియర్స్, పెన్షనర్ల గ్రాట్యుటీ, కమ్యూటేషన్ బిల్లులు వంటి మొత్తం రూ.13 వేల కోట్ల బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదనంగా, సీపీఎస్ రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న 67 సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి...

**తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ...**




సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సెక్రటేరియట్ లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో

ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, డివిజన్, జిల్లా కేంద్రాలు, హెచ్ఓడీ కార్యాలయాలలో మధ్యాహ్న భోజనం విరామ సమయంలో నిరసనలు చేపట్టి తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. 2 వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 నెలలు గడిచినా నివేదిక వెలువడక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నివేదికను ప్రకటించి 51 శాతం ఫిట్‌మెంట్ తో జూన్ 2 లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రస్తుతం ఇచ్చే అరకొర నిధులు ఉద్యోగులు, పెన్షనర్ల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కొత్త ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్) విధానాన్ని వెంటనే అమలు చేసి నగదు రహిత వైద్యం అందుబాటులోకి తేవాలని కోరారు. అలాగే ప్రస్తుత సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ పొందిన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన నాలుగు డిమాండ్లతో పాటు మరిన్ని 64 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణను చేపడతామని జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు, కో-చైర్మన్లు, కార్యవర్గ సభ్యులు మరియు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన ఎస్.టి.ఎస్.ఏ ఫౌండర్ తాళ్ల అజయ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2026 సంవత్సరానికి గాను తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫౌండర్ తాళ్ల అజయ్ ఎంపికయ్యారు. ఈ మేరకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్ ఆరే సాగు ప్రమోద మహాజన్, టేకి రాజశేఖర్ లు తాళ్ల అజయ్ కు అవార్డు ఈ అవార్డు పత్రాన్ని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కై బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం అకాడమీ 9 వ తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును ఏప్రిల్ 19న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందజేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 31 జిల్లాల నుండి సుమారుగా 300 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరవుతారని తెలిపారు.

# తెలంగాణా ప్రజలకు ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలి

**టి యు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి**

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి): పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం సరైంది కాదనీ, ఇది అతని అవగాహన లేని తనానికి నిదర్శనం అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తేజస్వి సూర్య వెంటనే క్షమాపణలు చెప్పాలనీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఆంధ్ర దోపిడికి వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, నీళ్లు నిధులు నియామకాల కోసం ఎంతో మంది రక్తతర్పణ చేశారనీ,1969 తొలి దశ ఉద్యమం లో 369 మరవీరుల త్యాగాలు, మలి దశ ఉద్యమం లో 1200 అమరవీరుల బలి దానంతో వచ్చిన తెలంగాణను పాకిస్తాన్ తో పోల్చడం తేజస్వి సూర్య సిగ్గులేని, అవగాహన లేని తనానికి నిదర్శనం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏడల బిజెపి వైఖరి ఇదేనా ? అని ప్రశ్నించారు. దీనిపై బిజెపి పార్టీ సమాధానం చెప్పాలి, ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పేదాకా తెలంగాణ ప్రజలు వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.



VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శనివారం 18 ఏప్రిల్ 2026

# ఆర్టీసీ సమ్మెకు సన్నాహంగా గేట్ మీటింగ్



ఖమ్మం, ఏప్రిల్ 17 ( వాయిస్ టుడే ): ఖమ్మం డిపో జెఎసి ఆధ్వర్యంలో ఈరోజు సమ్మెకు సన్నాహకంగా గేట్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలను రిలీజ్ చేసి కార్మికులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు పాటీ.అప్పారావు ఖమ్మం రీజియన్ జేఏసీ నాయకులు ఎల్. ఆర్. కే రావు, కోటయ్య, బొల్లి కొండ. వెంకన్న, బూసిరెడ్డి వెంకటరెడ్డి మరియు డిపో జేఏసీ చైర్మన్ బేతంపూడి బుచ్చిబాబు, జగన్, ప్రదీప్ కుమార్, ఎం.ఎం.రావు, జే.కే కుమార్,కవిత,ఆదిలక్ష్మి, రాధా, నాగమణి, తాహిర్ పాషా, చలపతి రెడ్డి, రామకృష్ణ, రాణి తదితరులతో పాటు సుమారు 60 మంది కార్మికులు పాల్గొని సమ్మెకు సిద్ధమని ప్రకటించినారు.

ఈ గెట్ మీటింగ్ ఉద్దేశించి రాష్ట్ర జేఏసీ మీడియా ఇన్చార్జ్ పాటి. అప్పారావు మాట్లాడుతూ గత నెల 13వ తారీఖున 31 డిమాండ్స్ తో సమ్మె నోటీసు జారీ చేయడం జరిగిందని రెండుసార్లు లేబర్ కమిషనర్ దగ్గర చర్చలకు పిలిచిన యాజమాన్యం రాలేదని తెలియజేసినారు. ఎలక్ట్రికల్ బస్సుల వలన హైదరాబాద్ సికింద్రాబాద్ రీజన్లో డ్రైవర్ల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని 32వ డిమాండ్ గా సమ్మె నోటీసులు చేర్చడం జరిగిందని తెలియజేసినారు. ఈ 32 డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఈనెల 13వ తారీఖున సమ్మె డేట్ ను ప్రకటిస్తూ 22 ఏప్రిల్ 2026న ఆర్టీసీలో మొదటి డ్యూటీ నుండి నిరవధిక సమ్మె ప్రారంభిస్తున్నామని తెలియజేసినారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని తెలియజేసినారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించి యూనియన్లను పునరుద్ధరించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని, 2021, 2025 వేతన సవరణ అమలు చేయాలని కోరినారు. ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వారికీ ధారాధత్నం చేయడాని వెంటనే మానుకోవాలని, ఆ డిపోలలో పనిచేసే కార్మికులను ఆ డిపోలలోనే కొనసాగించాలని అన్యాయంగా బదిలీలు చేయరాదని కోరినారు. అన్ని కేటగిరీల ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రతను ప్రకటించాలని తెలియజేసినారు. ఈ గెట్ మీటింగ్ ఉద్దేశించి జిల్లా జేఏసీ కన్వీనర్ ఎల్ ఆర్ కే రావు మాట్లాడుతూ సమ్మెను విజయవంతం చేయడం కోసం ఖమ్మం రీజియన్ లోని 7 డిపోల కార్మికులు సిద్ధంగా ఉండాలని సమ్మె నోటీస్ ఇవన్నీ కార్మిక సంఘాలు కూడా ఈ సమ్మెను బలపరిచి విజయవంతం చేయాలని కోరినారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నాయకులు బొల్లికొండ.వెంకన్న, భూసిరెడ్డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ యూనియన్లకు అతీతంగా యావత్ కార్మిక వర్గం సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వెంటనే యాజమాన్యం జోక్యం చేసుకొని సమ్మెను నివారించడం కోసం ప్రయత్నం చేయాలని కోరినారు. ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీలు, మేధావులు, తెలంగాణ ప్రజలందరూ ఈ సమ్మెకు సహకరించి విజయవంతం చేయాలని కోరినారు.



## త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మం, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ): ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, రోడ్డు భద్రత వారోత్సవాల కి సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలలో త్రివేణి విద్యార్థులు వనీషా రెడ్డి, మెహక్ ముస్కాన్, సాకేత్ రామ్, లాస్య, చంద్ర సిద్ధార్థ్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు, ఈ సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, మరియు నగర మేయర్ పునుకొల్లు నీరజ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి వారిని అభినందించారు.విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి శుభాకాంక్షలు తెలియజేశారు . పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో ఎప్పుడు అత్యుత్తమ ప్రతిభ ని కనబరుస్తారనీ తెలియజేశారు. విజేతలైన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, తదితరులు అభినందించారు.



## హిందూ సమ్మేళనం ఇంటింటా కరపత్రాల పంపిణీ

ఖమ్మం ఏప్రిల్ 17 ( వాయిస్ టుడే) : ఏప్రిల్ 19 ( ఆదివారం ) సాయంత్రం, శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ ప్రవచన మండపం, రామాలయం వీధిలో నిర్వహించే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని, హిందువులంతా సంఘటితం కావాలని బిజెపి నాయకులు వీరభద్ర ప్రసాద్, ఇతర నాయకులు, మహిళా కార్యకర్తలతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వనం తేజస్వి, ప్రధాన కర్త కోవెల శ్రీనివాస్ ఆచార్యులు పాల్గొంటారని తెలిపారు.

## ఆత్మకూరి జగదీష్‌పై పీడీ యాక్ట్ అమలు పోలీస్ కమిషనర్



ఖమ్మం ఏప్రిల్ 17 వాయిస్ టుడే: రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పేదలకు ఉచితంగా అందాల్సిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, బయట రాష్ట్రాలక తరలిస్తుండటంతో ఖమ్మం జిల్లాలో 13 కేసులు, సూర్యాపేట, వరంగల్ జిల్లాలో రెండు కేసుల్లో ప్రధాన నిందుతుడుగా వున్న ఖమ్మం నగరానికి చెందిన ఆత్మకూరి జగదీష్ పై శుక్రవారం పీడీ యాక్ట్ అమలు చేసి హైదరాబాద్ చంచలగూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగిందన్నారు.దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడటంతో పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు తెలిపారు. పేదల కడుపు కొట్టే రేషన్ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## సీబీఎస్ఈ భోధనకు అనుమతి పొందిన ఆర్యభట్ట స్కూల్



తొర్రూరు, ఏప్రిల్ 17 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మహబూబాబాద్ రోడ్డులో ఉన్న ఆర్యభట్ట స్కూల్ అధికారికంగా అనుమతి లభించిందని పాఠశాల కరస్పాండెంట్ మధుకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శు క్రవారం పాఠశాల ఏర్పాటు చేసి సమావేశంలో మధూకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుండి ఈ పాఠశాలకు అప్లికేషన్ ను మంజూరు చేస్తూ గత రెండు రోజుల క్రితం సర్టిఫికెట్ జారీ అయిందన్నారు. ఈ పాఠశాలకు 3630662 అఫిలియేషన్ నంబర్ వచ్చిందన్నారు. ఈ పాఠశాలలో 9వ తరగతి వరకు సీబీఎస్ఈ పాఠ్యాంశాలను బోధిస్తుందని, ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. తొర్రూరు ఆర్యభట్ట విద్యాసంస్థలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్న ఉద్దేశంతో సీబీఎస్ఈ విధానంలో విద్యార్థులకు బోధన చేయడం జరుగుతుందన్నారు. తొర్రూరులో మా పాఠశాల సీబీఎస్ఈ అనుమతి లభించడంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు దోహదపడుతుందన్నారు. పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలతో, ల్యాబ్ లు, క్రీడ మైదానాలు విశాలమైన తరగతి గదులు వంటి వసతులతో ఉన్నాయని, తగిన అర్హతలు గల బోధనా సిబ్బంది కూడా ఉన్నందువల్ల విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందించేందుకు ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధనకు అనుమతించాలని కోరగా అనుమతులు వచ్చినట్లు తెలిపారు. వచ్చే ఏడాది సీబీఎస్ఈ బోధన పదవ తరగతి వరకు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నేలకుర్తి రోజా, వైస్ ప్రిన్సిపాల్ రామ్మూర్తి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అంకితభావం గల ఉపాధ్యాయుడు రాయలు

తొర్రూరు, ఏప్రిల్ 17 వాయిస్ టుడే : అంకితభావంగల ఆదర్శ ఉపాధ్యాయుడు రాయలు అని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తాళ్లూరి రాయలు ఇటీవల అకాలంగా మృతి చెందగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో బాధిత కుటుంబాన్ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు పరామర్శించారు. సతీమణి సరస్వతి, కుమారుడు శరత్ చంద్రను పరామర్శించి మండలంలోని ఉపాధ్యాయుల సహకారంతో రూ.1,10,500 లక్షల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ...పేద బిడ్డల అభ్యున్నతికి పాటుపడిన అంకితభావం గల ఉపాధ్యాయుడు రాయలు అని, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్న సెలవు పెట్టకుండా పాఠశాలకు హాజరయ్యేవాడని గుర్తు చేశారు. పేద బిడ్డల మోముల్లో విద్యా వెలుగులు ప్రసరింప చేయాలని కలలుగన్న ఆదర్శ ఉపాధ్యాయుడు రాయలు అని కొనియాడారు.మృతుడి కుటుంబానికి విద్యాశాఖ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు అందే విధంగా సహకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు తుమ్మ వెంకటేశ్వర్లు, జెల్లా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పులి ముత్తిలింగం, జనార్ధన్ కొలుపుల శ్రీనివాస్ చంద్రమౌళి రఫీ, కృష్ణ, రమేష్, నాగ మల్లయ్య, సురేందర్, చైతన్య, యాకయ్య, మల్లేష్, భాస్కర్, రమేష్, దర్గా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిగొండలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ముదిగొండ మండలం ఏప్రిల్ 17 వాయిస్ టుడే : మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్ వేదికగా శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆశీస్సులతో, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘు రామిరెడ్డి ప్రత్యేక సిఫార్సు మేరకు ఈ నిధులు మంజూరయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేశారు. అందులో భాగంగా న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు సయ్యద్ అజ్మత్ రూ 44,500/-,పెద్దపొంగు లక్ష్మీ ?34,000/- అందజేశారు ఈ కార్యక్రమంలో న్యూ లక్ష్మీపురం మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య, మాజీ వార్డు మెంబర్ సయ్యద్ రఫీ, ముఖ్య నాయకులు సయ్యద్ తాజుద్దీన్, ఊరుకొండ రాజు, బట్టు బసవయ్య తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు ఎంపీ రఘురామిరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను చేరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్




తొర్రూరు, ఏప్రిల్ 17 వాయిస్ టుడే : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ రోజు తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ , పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా తొర్రుర్ డివిజన్ ఆర్డీవో గణేష్ కు వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు జంజిరాల నాగరాజు, తహసిల్దార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అనిల్ , తపస్ జిల్లా బాధ్యులు బింగోని బాలరాజు, ఎనగాండ్ల నాగిరెడ్డి, భోగ నవత, పులుగుజ్జ యాకయ్య, తొర్రూరు మండల అధ్యక్షులు మెరుగు రమేష్, దంతాలపల్లి మండల ప్రధాన కార్యదర్శి అమరగొండ మహేందర్, గౌరవ అధ్యక్షులు తెమడ హరిబాబు, నెల్లికుదురు మండలం ప్రధాన కార్యదర్శి చెన్నోజు కళ్యాణ్, తాసిల్దారుల సంఘం మానుకోట జిల్లా అధ్యక్షులు కె అనిల్ కుమార్, రెవిన్యూ డివిజన్ కార్యాలయం సిబ్బంది విక్రం, వెంకటేష్,అనిల్, నవీన్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులు అనుమల సుధాకర్ , లాడే మహేందర్, అశోక్ మాలి, నరసయ్య, కక్కర్ల రామ్మూర్తి, పొన్నోజు అశోక్ జిపిఓల సంఘం మండల అధ్యక్షులు బండి విజయ్ కుమార్ , రవి, నారాయణ, జానీ వెంకన్న, అచ్చయ్య, సుధాకర్, రమేష్,లావణ్య తదితరులు పాల్గొన్నారు.


# మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

## భూమిలో చెప్పట్టిన అమృత్ జల్ ప్రతి పదనలు రద్దు చేయాలి

## అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ రాయికల్ పట్టణం కు చెందిన అమృత్ జల్ పథకం భూ బాధితుడు కుర్మా మల్లారెడ్డి మానవ హక్కుల కమిషన్ శుక్రవారం ఆశ్రయించగా ఐస్ ఆర్ నెంబర్ అనుసరించి 1567/2026 కమిషన్ లో ఫిర్యాదు నమోదయింది. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతు.. పట్టా భూముల పంట పొలాల మధ్య రైతులకు దాదాపు (80) మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు నష్టం వాటిల్లే విధంగా కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, అనవసరంగా (అవసరం లేనిచోట) వాటర్ ట్యాంకు నిర్మాణము పేరుతో మా యొక్క భూములను అన్యాయంగా లాక్కొనే ప్రక్రియను అధికార యంత్రం నిలిపివేసి, వేరొక చోట నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికిని స్పందించక పోవడంతో మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించడం జరిగిందని తెలిపారు.

వ్యవసాయ ఆధారిత రైతులము అయిన. మేము కుర్మ మల్లారెడ్డి, కుర్మ నారాయణ రెడ్డి, కుర్మ ప్రేమ్ కుమార్ రాయికల్ పట్టణంలో నివసిస్తున్నాము. మాకు సర్వేనెంబర్ 988/2/1/1/1, 988/2/1/2/1, 988/2/1/3/1 యందు వ్యవసాయ పట్టా భూములను కలిగియున్నాము. ఇట్టి భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాము.



మాకు ఇట్టి భూమే వ్యవసాయమే జీవనాధారము. కానీ, ఇట్టి సర్వేనెంబర్ల యందు రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖల వారు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, మా అనుమతి లేకుండా, బలవంతంగా మా భూమిని లాక్కోవాలనే దురుద్దేశ్యంతో వాటర్ ట్యాంకు నిర్మాణం కొరకు భూసేకరణ చేస్తున్నట్లుగా పై అధికారులకు నివేదికను పంపారు అని. మా అనుమతి లేకుండానే మా భూములను ల్యాండ్ ు సర్వే విభాగం వారిచే తప్పుడు సర్వే నిర్వహించి కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, ఇట్టి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయుటకు బలవంతంగా మమ్ములను బెదిరిస్తూ యంత్రాలతో ఇట్టి భూములలో నిర్మాణ పనులకు చేసేందుకు నాలుగు శాఖల అధికారులు కదిలి వచ్చి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని. అధికారులు మా కుటుంబాలను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయికల్‌లో ఇప్పటికే మిషన్ కాకతీయ క్రింద ఆరు వాటార్ ట్యాంకుల నిర్మాణం చేసినారు. ఇందులో ఒక మెగా వాటర్ ట్యాంక్ ఉందని ఇది ఒక్కటే రాయికల్ మండలం మొత్తాన్ని త్రాగునీరు సరఫరా చేయగల సామర్థ్యం కలదనీ అయినప్పటికిని మా పంట వట్టాభూముల్లో అక్రమంగా ఆక్రమించి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాలని సంకల్పించినారు. ఒకవేళ వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగితే మాతో పాటు మా చుట్టు ప్రక్కల ఉన్నటువంటి రైతుల భూముల నుండి పైపు లైన్ల ను ఏర్పాటు చేయవల్సి వస్తుంది అని దాంతో వారు కూడా తీవ్రంగా నష్ట పోతారు మేము గతంలో ప్రభుత్వ ఐ.కె.పి. -స్త్రీశక్తి భవన్ ఉచితంగా దాదాపు 06 గుంటల భూమిని దానంగా ఇవ్వడం జరిగింది. ఇప్పుడు బలవంతంగా మా యొక్క భూమిని కబ్జా చేయుటకు అధికారులు చూడడంతో మా మూడు కుటుంబాలు రోడ్డున పడి అడుక్కునే పరిస్థితికి నెలకొంది అని అధికారులు బలవంతంగా గుంజుకుంటే మాకు ఆత్మహత్యే శరణ్యం. కన్నీటి పర్యంతమయ్యాడు. వాస్తవముగా ఇట్టి వాటర్ ట్యాంక్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ భూములలో నిర్మించుటకు అవకాశము ఉంది అని అయిన అధికారులు ఉద్దేశ్యాపూర్వకంగా మా పంట భూములను నాశనం చేయాలని అధికారులు సంకల్పించడం శోచనీయం.అని అన్నారు. మా యొక్క వంట పట్టా భూముల యందు ఏర్పాటు చేయ చేయతలపెట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణము నిలిపివేసి, మా భూమిపై అధికారులు చేసిన తీర్మానాలు అధికారులు రద్దు చేయాలని మా భూములు మాకు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు.



## ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు

### కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

ధర్మపురి, ఏప్రిల్ 17 (వాయిస్ టుడే) : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ధర్మపురి వారి ఆధ్వర్యంలో.. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం లోని కమలాపూర్ గ్రామంలో గల స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణ యందు శుక్రవారం రోజు మధ్యాహ్నం వేళలో పోషణ పక్వాడ కార్యక్రమం లను ఎంతో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమ నిర్వహణ శుభ సందర్భంగా తల్లి బిడ్డల మధ్య పరస్పర అనుబంధాన్ని పెంపోందించడంతో పాటు, పిల్లలలో భాషా నైపుణ్యాన్ని మెరుగు పరచడం పట్ల తల్లులకి సిడిపిఓ వాణి శ్రీ, ఏసి డిపిఓ మౌనిక, సూపర్వైజర్ నీలిమ అవగాహనను కల్పించారు. తల్లి బిడ్డల మధ్య ఆరోగ్యకరమైన సంభాషణలు, ఆటల ద్వారా అభ్యాసన పద్ధతులను నేర్పించడం వల్ల, ఆహారం తినిపించే సమయంలో పిల్లలతో మాట్లాడటం వల్ల ఇంట్లో అందుబాటులో ఉన్నటు వంటి వస్తువులతో ఆడుకోవడం వల్ల పిల్లల ఎదుగుదలలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో క్రియా శీలకంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. పిల్లలలో భాష నైపుణ్యాలు మెరుగు పరచడానికై కథలు, రైమ్స్, అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యల గురించి ప్రతి రోజు పిల్లలకు చెప్పాలని తోలి ఆరు సంవత్సరాలలో పిల్లల మెదడు అభివృద్ధికై అవసరమైన ప్రేరణ లతో పాటు, ఆటలు, సంభాషణల ద్వారా ముఖ్య పాత్రను వహిస్తాయని తల్లిదండ్రులతో పాటు, వారి సంరక్షకులకు తమ అవగాహనను కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి లతో పాటు, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి, ఏఎన్ఎం ఆశా కార్య కర్త, అంగన్ వాడి టీచర్స్ వెంకటమ్మ, సంపూర్ణ ఆయాలు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతి నిధులు, సిబ్బంది, పిల్లలు, పాల్గొన్నారు.



## ఆత్కూరులో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని గ్రామ ప్రజలు, దళిత సంఘాల నేతల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నిర్వాహకులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడం ద్వారా యువతలో సామాజిక చైతన్యం పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకను జై భీమ్ యూత్ ప్రతినిధులు మొట్రూ మురళి, జంగం మోహనరావు, కొమ్ము కోటేశ్వరరావు, ఓగిరాల కనక సుందరం, కొమ్ము మధు కుమార్, ముగ్గిరాల అశోక్, బొనుగు నాగ ఫణి, భీరా బాబీ, కొమ్ము నాని, కలపర్తి చింటు, కలపర్తి బన్ను పర్యవేక్షించి జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు మరియు అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించిన మేయర్



పాల్వంచ ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచ పట్టణం 8వ డివిజన్లో శుక్రవారం నాడు శ్రీ కనకదుర్గ క్యాస్టింగ్ మరియు ఇంజనీరింగ్ వర్క్స్ వారి ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చడం, మండుతున్న ఎండల కారణంగా ప్రతి సంవత్సరం ప్రజల దాహార్తి తీరుస్తూన్న శ్రీ కనకదుర్గ క్యాస్టింగ్ మరియు ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత లింగమర్ల కృష్ణారావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలకు తగిన సమయంలో నీరు అందించడం మంచి సేవా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగమర్ల కృష్ణారావు, లింగమర్ల సతీష్ కుమార్, షేక్ అజీజ్, గౌతమి కృష్ణ, కనగాల అనంతరాములు, అబ్దుల్ ఘనీ, పేటేటి నరేష్, స్థానిక కార్పొరేటర్లు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన న్యాయవాది ఆల్లె పురుషోత్తం



రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణానికి చెందిన కళావతి అనే మహిళకు అత్యవసర సమయంలో శాస్త్ర చికిత్స కోసం రక్తం అత్యవసరం కావడంతో స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు వచ్చి న్యాయవాది అల్లే పురుషోత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రి లో రక్తదానం చేశారు. ఇది తొమ్మిదవ సారి రక్తదానం కావడంతో అవసరం వచ్చినప్పుడు రక్తదానం చేసినందుకు ఆయనను పలువురు అభినందించారు. ఇట్టి సందర్భంగా న్యాయవాది అల్లే పురుషోత్తం మాట్లాడుతు రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని ,కొందరు భావిస్తున్నారని ఇది పూర్తిగా ఆవాస్తవం అని రక్తదానం వలన శరీరంలో పాత రక్తం పోయి కొత్త రక్తం రావడంతో గుండెపోటు లాంటి సమస్యల భారీన పడకుంట ఉంటారని మరిన్ని ఆరోగ్య ఉపయోగాలు రక్తదానం వలన ఉన్నాయని రక్తదానం చెయ్యడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు నమ్మవద్దని అందరు అత్యవసర సమయంలో రక్తదానం చేయుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు.



## ఉద్యోగుల డిమాండ్లపై ఎమ్మార్వోకు వినతి

### ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి సందీప్ పులిజ్వాల.

జడ్చర్ల, ఏప్రిల్ 17 వాయిస్ టుడే : జూన్ రెండవ తేదీ నాటికి పి ఆర్ సీ అమలు పెండింగ్ డి.ఏ విడుదల ,రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ క్లియరెన్స్ , సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరణ, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసత్వ సమస్య, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు తదితర సమస్యలపై మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల తాసిల్దార్ నర్సింగ్ రావు కి టీజీ జేఏసీ తరపున వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిజిసిపిఎస్ఇయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సందీప్ పులిజ్వాల, జిపిఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

### - పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసన

ఖమ్మం ఏప్రిల్ 17 ( వాయిస్ టుడే ): పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం పార్లమెంట్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడటాన్ని భారత్- పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, ఇది తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమే అని అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కారని, పార్లమెంటు రికార్డుల్లో ఈ వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ.. " బిజెపి క్షమాపణలు చెప్పాలి", " తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ..నినాదాలతో హోరెత్తించారు.

## గన్నవరంలో ఘనంగా ప్రియదర్శిని కాలేజ్ నూతన కార్యలయం ప్రారంభం

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): తెనాలికి చెందిన ప్రముఖ విద్యాసంస్థ ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ గన్నవరం సిటీ కార్యాలయం ను ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. లక్ష్మీ నారాయణ ముందుగా రిబ్బన్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ 18 సంవత్సరాల కాలం నుండి మా విద్యాసంస్థలు పేద,నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులకు సేవలు అందిస్తూ,అండగా నిలుస్తున్నాయన్నారు.అటనామస్ హోదా కలిగిన మా కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నామని,క్రమశిక్షణ కలిగిన విద్యను అందించి,ప్రభుత్వ రంగ సంస్థలలో విద్యార్థులు స్థిరపడేలా ప్రముఖ కంపెనీలలో ఎంఓయూ కుదుర్చుతున్నామన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సుజాత మాట్లాడుతూ చందు రామారావు, విజయలక్ష్మి నేతృత్వంలో ఈ విద్యాసంస్థలు అద్భుతంగా కొనసాగుతున్నాయని, ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని అన్నారు.అడ్మిషన్ల డైరెక్టర్ పెన్నాడ చిన్ని మాట్లాడుతూ పేద విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో మంచి విద్యను అభ్యసించి,మెరుగైన హాస్టల్ వసతి,మంచిగా సక్రమైన వసతులు, సదుపాయాలు అందించటమే ప్రియదర్శిని కాలేజ్ లక్ష్యం గా పని చేస్తుందని, అందరూ ఈ సాధవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్ని కోరారు.




## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల వెంటనే పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ ఏప్రిల్ 17( వాయిస్ టుడే): ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టి జి ఈ జె ఏ సి ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గంగపుత్ర సైదులు మాట్లాడుతూ పి ఆర్ సి కమిటీ నివేదిక ప్రకారం జూన్ 2 లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా పేర్కొన్న 13 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఉద్యోగులకు, రిటైర్డ్ అయిన వారికి వెంటనే ఆరోగ్య భద్రత కార్డును మంజూరు చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మధుసూదనా చారి కృష్ణ నాయక్ నారాయణస్వామి ఉద్యోగులు పాల్గొన్నారు.



## మానవసేవే మాధవసేవ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

### కార్యక్రమంలో పాల్గొన్న వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్

పాల్వంచ ఏప్రిల్ 17 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ నటరాజ్ సెంటర్ గత 9 నెలలు నుండి ప్రతి నెల పితృ అమావాస్య పర్వదినం సందర్భంగా...మానవసేవే.. మాధవ సేవ. కార్యనిర్వాహన సభ్యుల ఆధ్వర్యంలో... 300 మందికి పైగా అన్నప్రసాదాం వితరణ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాష్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలను కన్నా అన్నదానం చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవసేవి మాధవసేవ కార్యనిర్వాహన సభ్యులు బండారు సత్యనారాయణ చారి, బండారు శ్రీనివాసాచారి, గుత్త శివన్నారాయణ, దాసరి రాజు, గడిపేసి నరసింహారావు, బండారు రామాచారి, ధనుమూరి వీరాచారి, లింగాచారి, నరేష్, కోటా సత్యనారాయణ, జగదీశ్వర్ రావు, శ్రీనివాసరావు. భానుమూర్తి .రామకృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
శనివారం 18 ఏప్రిల్ 2026



## బారదాను సంచుల పంపకంలో నిర్లక్ష్యం

శాయంపేట (వాయిస్ టుడే): మండలంలో గత పది రోజుల క్రితం ఎమ్మెల్యే ప్రారంభించిన మక్కల కొనుగోలు కేంద్రంలో రైతులకు మక్కలు నింపుకునేందుకు ఏర్పరిచే బారదాను కరువైంది. గతంలో ఎన్నడు లేని విధంగా భారీ స్థాయిలో మండల వ్యాప్తంగా రైతులు కష్టపడి పండించిన మక్కల కొనుగోలు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రాథమిక సహకార సంఘం పర్యవేక్షణలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.కానీ పి ఎ సి ఎస్ ప్రతినిధుల నిర్లక్ష్యం వలన అసలు రైతులకు కాకుండా బారదాను పక్కదారి పడుతుందని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యక్తులను పెట్టి సంచులను అనధికారింగా తరలిస్తున్నారని , వర్షాలు పడే అవకాశం ఉంది కావున చేతికందిన పంట పాడయ్యే అవకాశం ఉందని దయచేసి స్థానిక ఎమ్మెల్యే మరియు సంభందిత అధికారులు స్పందించి పి ఎ సి ఎస్ ప్రతినిధుల ద్వారా అర్హులైన రైతులకు మాత్రమే బారదాను అందించాలని రైతులు కోరుతున్నారు.




## రోడ్డు ప్రమాద సమయంలో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యితపై ఎస్ఐ చంద్రకుమార్ అవగాహన

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్-17 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా రోడ్ సేఫ్టీ పై ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం. జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రకుమార్ మాట్లాడుతూ, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రమాదం జరిగిన మొదటి గంటలో క్షతగాత్రులకు చికిత్స అందించినట్లయితే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది కనుక ప్రమాద సమయంలో బాధితులకు సహాయం చేయాలని కోరారు. అదేవిధంగా రహవీర్ స్కీం గురించి వివరించడం జరిగింది. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కరుణాకర్, కానిస్టేబుళ్లు రాకేష్, హరీష్, సంపత్ లు పాల్గొన్నారు.




## పూసాల 13వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్-17 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాల లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తొంభై తొమ్మిది రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమం పదమూడవ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత పాల్గొని,పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత కౌన్సిలర్ లు ఈర్ల స్వరూప శేఖర్, గాజుల రాజమల్లయ్య కందునూరి సమత కుమార్, గరిగే శోభారాణి శ్రీనివాస్, చింతల రాజు, తొర్రి కొండ ప్రభాకర్, కల్వల శంకరమ్మ ఓదెలు, అమిరి శెట్టి శ్రావణి రాకేష్, సిద్ధ తిరుపతి, వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్, గాదాసు మంజుల రవీందర్, కాంగ్రెస్ నాయకులు వేగోళం కరుణాకర్, చీకట్ల రాజయ్య, చొప్పరి వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జిగా శ్యామ సుందర్



హుజూర్ నగర్, ఏప్రిల్, 17 (వాయిస్ టుడే ప్రతినిధి): భువనగిరి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎన్. శ్యామ సుందర్ ను హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు మునుపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన రాధాకృష్ణ చౌహాన్ పదోన్నతి పై బదిలీ కాగా అప్పటినుండి హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పోస్టు ఖాళీగా ఉండగా కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ ఇన్చార్జి జడ్జిగా పనిచేస్తున్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ సివిల్ జడ్జి పోస్టును నూతన జడ్జి నియామకముతో హైకోర్టు భర్తి చేసింది. ఈనెల 25 వ తేదీ లోగా నూతన న్యాయమూర్తి తన బాధ్యతలను స్వీకరించాలని ఆ ఉత్తర్వులలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 14 మంది సీనియర్ సివిల్ జడ్జిల ను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టాలి

### ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అధికారులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన ఆయన, మరికొన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పారిశ్రామిక ప్రాంతానికి పూర్వ వైభవం వచ్చిందని అన్నారు. ఒకప్పుడు పొగాకు కు ప్రసిద్ధి చెందిన మల్లవల్లి, నేడు రాష్ట్రానికే తలమానికంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. మీ బిడ్డల భవిష్యత్తు మారాలంటే పరిశ్రమలు రావడం ఎంతో అవసరమని ఆయన ఉద్ఘాటించారు. గ్రామాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని ఎజెండాగా పెట్టుకుని, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే మూడవ స్థానంలో ఉందని, రాబోయే కాలంలో దీనిని ప్రథమ స్థానానికి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు అందిన అర్జీలలో మెజారిటీ సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అధికారులకు ప్రజల సమస్యల పట్ల బాధ్యత ఉండాలని, సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలను స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. మడిచర్ల, కొయ్యూరు, కొత్తపల్లి, కొత్త మల్లవల్లి వంటి గ్రామాల్లో రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారిగా గన్నవరంలో బీకాం కంప్యూటర్స్, బీటెక్ చదివిన విద్యార్థుల కోసం ఎజూ కంపెనీతో కలిసి 'ూ× ఫ్రీ ట్రైనింగ్' వచ్చే నెల నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అశోక్ లేలాండ్ వంటి కంపెనీల ద్వారా సుమారు 920 మందికి, మొత్తం మీద నియోజకవర్గంలో 15,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ జోగేశ్వరరావు, తహసీల్దార్ మురళి కృష్ణ , గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, బాపులపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, ఎన్.ఎస్.పి లెఫ్ట్ మెయిన్ కెనాల్ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, పిడికిటి రాంబాబు, మోటారు వాసు, దేవినేని సత్యనారాయణ, షేక్ జాన్ భాషా, తూమాటి సాంబశివరావు, ఆలూరి రామకృష్ణ, వి.ఎస్.ఆర్ కృష్ణ ప్రసాద్ (నాని), అక్కినేని ధర్మరాజు, కాకుమాను వెంకటేశ్వరరావు, వడ్డీ అశోక్, అక్కినేని కృష్ణాజీ, కాంద్రు అజయ్, అక్కినేని రవి, అక్కినేని కృష్ణాజీ, అవిర్నేని భవాని శంకర్, యంగ్ ప్రొఫెషనల్ పోతురాజు రాజేష్, మొవ్వ వేణుగోపాల్, కొల్లూరు చంద్రకాంత్, మాదల శ్రీనివాసరావు, కంపసాటి ప్రసాద్, బల్లమూడి కృష్ణ, కూకటి విజయ్ కుమార్, కొసరాజు సాయిరాం, బుస్సే నాగప్రసాద్, కొసరాజు సాయిరాం మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం పట్ల హర్షం



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను గన్నవరం ఎమ్మెల్యే మరియు ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి వెళ్లిన ఆయన, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని మరింత శక్తివంతమైన రాజకీయ పక్షంగా తీర్చిదిద్దడంలో లోకేష్ కీలక పాత్ర పోషిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు టీడీపీ ద్వారా 1289 మంది ఎమ్మెల్యేలు, 149 మంది లోక్‌సభ సభ్యులు దేశానికి ప్రాతినిధ్యం వహించారని, 9 మంది కేంద్ర మంత్రులు, వందల సంఖ్యలో రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ మరియు శాసనమండలి సభ్యులను అలానే అనేక మంది ప్రజా నాయకులను దేశానికి అందించిన విశిష్ట గౌరవం తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. దేశ ప్రధానుల, రాష్ట్రపతి ఎంపికలోనూ, అలాగే లోక్‌సభ స్పీకర్, గవర్నర్ పదవుల భర్తీలోనూ టిడిపి కీలక పాత్ర పోషించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు గారి మహత్తర దూరదృష్టితో 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు తన క్రమశిక్షణ, విజన్‌తో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని యార్లగడ్డ తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్‌ను 10 రెట్లు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదేనని ఆయన గుర్తు చేశారు. అంకితభావంతో శ్రమించే కార్యకర్తలే టిడిపికి అసలైన బలమని, అలాంటి గొప్ప వారసత్వం మరియు విలువలున్న పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ బాధ్యతలు స్వీకరించడం ఒక గౌరవప్రదమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహించాలని యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు.



## వార్డులో గడప గడపకు నీటి సరఫరా అందించే దిశగా చర్యలు

హుజూర్ నగర్, ఏప్రిల్, 17 (వాయిస్ టుడే ప్రతినిధి): పట్టణంలోని 14 వ వార్డులో గడప గడపకు నీటి సరఫరా అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని 14 , 15 వార్డులలో కౌన్సిలర్ల దగ్గుపాటి కవిత బాబురావు. నల్లగొండ సుజాత చంటి లు అన్నారు. శుక్రవారం వారి ఆధ్వర్యంలో పొనుగుపాటి అశోక్ ల్యాండ్ లో ఉన్న బోరు. ఎస్సీ కమిటీ హాల్ లో బోరు కలెక్షన్లు ఇస్తున్నామని తెలిపారు. హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ సహకారంతో, ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి వార్డులో నీటి సరఫరా మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ట్యాంకర్లపై ఆధారపడకుండా, హుజూర్ నగర్ పట్టణ ప్రజలకు గడప గడపకు నీరు అందించాలనే లక్ష్యంతో అధికారులు కౌన్సిలర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయం చేస్తున్నారు. వార్డులలో ఉన్న భగీరథ కనెక్షన్లు, బోర్లు, బేతవోలు వాటర్ లైన్లకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా 14-15- వార్డుల కౌన్సిలర్లు దగ్గుపాటి కవిత బాబురావు. నల్లగొండ సుజాత చంటి లు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా తమ వార్డులో నీటి లైన్ కనెక్షన్లను మరమ్మతులు చేస్తూ ప్రతి ఇంటికీ నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల్లపూడి కళ్యాణ్, కోల్లపూడి దయాకర్, లచ్చిమల్ల నాగేశ్వరరావు, అలవాల ఉపేందర్, దుగ్గి సైదులు,. రేపాకుల రామకృష్ణ, అలవాల నరేష్, లింగం రవి, మమత, శవలమ్మ, రాణి, బెంజిమెన్, మామిడి రాజేష్, మామిడి సాగర్, దగ్గుపాటి రాజేష్, వినోదు, లక్ష్మణ్, అంజయ్య, కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ



అశ్వారావుపేట గ్రామీణం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను వరంగల్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఠాణాలోని రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలు, వాటి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో సిబ్బందికి సూచనలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

## ముదిగొండలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ముదిగొండ మండలం ఏప్రిల్ 17 వాయిస్ టుడే : మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్ వేదికగా శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆశీస్సులతో, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘు రామిరెడ్డి ప్రత్యేక సిఫార్సు మేరకు ఈ నిధులు మంజూరయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేశారు. అందులో భాగంగా న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు సయ్యద్ అజ్మత్ రూ 44,500/-,పెద్దపొంగు లక్ష్మీ ?34,000/- అందజేశారు ఈ కార్యక్రమంలో న్యూ లక్ష్మీపురం మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య, మాజీ వార్డు మెంబర్ సయ్యద్ రఫీ, ముఖ్య నాయకులు సయ్యద్ తాజుద్దీన్, ఊరుకొండ రాజు, బట్టు బసవయ్య తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు ఎంపీ రఘురామిరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను చేరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**